ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 31.0

కనిష్ఠం : 26.0

## పొగాకు అ'ధర'హో..

- కిలో పొగాకు ధర రూ.368
- వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధికం

7

# ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు 53,863 దరఖాస్తులు



విలేకరులతో మాట్లాడుతున్న అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, జూన్ 28 : రాజీవ్‌గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు అధికభాగం బాలికల నుంచి దరఖాస్తులు అందాయని ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు మొత్తం 53,863 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 30,857 మంది బాలికలు ఉండగా, 23,006 మంది బాలురు ఉన్నార న్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 2,582 మంది, ఎన్‌సీసీలో 1830, స్పోర్ట్స్ విభాగంలో 1162, దివ్యాంగుల విభాగంలో 332, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

### ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ

జూలై 1వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సైనిక సంతతికి చెందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు, దివ్యాంగు లకు, స్పోర్ట్స్ విభాగంలోని వారికి జూలై 3వ తేదీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి జూలై 2,3 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుదిజాబితా జూలై 11న విడుదల చేస్తారని, నూజివీడు, ఆర్కే వ్యాలీలలో ఆయా క్యాంపస్‌లకు కేటాయించిన విద్యార్థులకు జూలై 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 26,27 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

### ప్రత్యేక కేటగిరీల్లో పోటాపోటీ

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో 2024 అడ్మిషన్‌లలో తీవ్ర పోటీ నెలకొంది. ఈసారి సాధారణ కేటగిరిలోనే కాక ప్రత్యేక కేటగిరిల్లో సైతం అడ్మిషన్లకు పోటీ నెలకొనడం విశేషం. క్రీడల విభాగంలో 0.5శాతం రిజర్వేషన్ క్రింద మొత్తం నాలుగు క్యాంపస్‌ల మీద 20 సీట్లను కేటాయించగా, 1162 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో సీటుకు దాదాపు 58 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 40 సీట్లకు 2,587 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఇక్కడ ఒక్కో సీటుకు 64 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ విభాగంలో 80 సీట్లకు 1,830 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 22.8 మంది పోటీ పడుతుండగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 20 సీట్లకు 270 మంది దరఖాస్తు చేశారు. ఈ విభాగంలోనూ 14 మంది విద్యార్థులు పోటీ పడుతుండగా, ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మాత్రం 200 సీట్లకు 332 మంది దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 1.66 మంది విద్యార్థులు పోటీ ఏర్పడింది. మొత్తం మీద స్పెషల్ కేటగిరీలో ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది.

# త్రిసభ్య కమిటీలకు చెల్లుచీటీ



సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలపై వేటు పడింది. వారి స్థానంలో పర్సన్ ఇన్ చార్జిలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సహకార అధికారులకు నియామకపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాలతో తక్షణమే జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలకు చెక్ పడింది.

## పర్సన్ ఇన్‌చార్జిల నియామకం

- జిల్లాలో 152 సొసైటీల్లో నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో సంఘాలు నిర్వీర్యం

ఏలూరు సిటీ, జూన్ 28 : జిల్లాలో 159 పీఏసీఎస్ (సహకార సంఘాలు) ఉన్నాయి. గతంలో 2013, జూలైలో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వాటి పదవీకాలం అప్పటి ప్రభుత్వ హయాంలో 2018 జూలై వరకు కొన సాగింది. అయితే అప్పట్లో ఆ కమిటీలకు మరో ఏడాది కాలం పాటు పదవీకాలాన్ని టీడీపీ ప్రభుత్వం పొడిగించింది. ఆ కమిటీలకు సంబంధించి పదవీకాలం 2019 జూలై వరకు కొనసాగింది. ఆ తర్వాత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పా టు కావడంతో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించ కుండా త్రిసభ్య కమిటీలను ఆరు నెలల పదవీకాలానికి నామి నేట్ చేశారు. ఆ రకంగా గత ప్రభుత్వహయాంలో ఎప్పటి కప్పుడు ఆరు నెలలకొకసారి త్రిసభ్య కమిటీల పదవీకాలాన్ని పొడిగిస్తూ గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ రకంగా పరిశీలిస్తే అప్పట్లో ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై 30వ తేదీతో ముగుస్తుంది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. జిల్లాలో 159 సహకార సంఘాలు ఉండగా వివిధ కారణాలతో 7 సహకార సంఘాలకు అప్పట్లోనే పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులను నియమించారు. మిగిలిన 152 సహకార సంఘాల్లో 124 సహకార సంఘాలకు సంబంధిం చిన త్రిసభ్య కమిటీల సభ్యులు రాష్ట్రంలో ప్రభుత్వం మార్పు జరగగానే రాజీనామాలు సమర్పించారు. మిగిలిన 28 సహకార సంఘాలకు సంబంధించి త్రిసభ్య కమిటీలకు చెందిన వారు రాజీనామాలు సమర్పించలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ త్రిసభ్య కమిటీలను రద్దు చేసి ఆ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారికంగా అధికారు లను నియమించింది. ఒక నెల పదవీకాలం ఉన్నా త్రిసభ్య కమిటీలను రద్దు చేయడం విశేషంగా పేర్కొనవచ్చు. జిల్లాలో మొత్తం 152 సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### సొంత పార్టీ నాయకులకు పెద్దపీట

మరోవైపు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట వేశారు. గడచిన ఐదేళ్లలో సహకార సంఘాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ సహకారం కొరవడింది. ధాన్యం కమిషన్ సొమ్ములు ఇవ్వలేదు. జిల్లా సహకార బ్యాంకుల్లో కమిషన్‌ను డిపాజిట్ చేశారు. దానికి వడ్డీని సహకార సంఘాలకు అందిస్తూ వచ్చారు. ఒక పర్యాయంలో రైతులకు ఇచ్చిన రవాణా చార్జీలు కూడా సొసైటీలకు విడు దల చేశారు. ఆ సొమ్మంతా రైతు ఖాతాల్లో జమ చేయాలి. కానీ సొమ్మంతా వైసీపీ నియోజకవర్గ నేతలతో పాటు, త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు తినేశారు. తర్వాత ప్రభుత్వం కమిషన్ ఎవ్వరికీ విడుదల చేయలేదు. వైసీపీ నేతలు చెప్పినట్టుగానే సొసైటీలు నడిచాయి అంతే తప్ప రైతులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది.

### నిబంధనలకు విరుద్ధంగా..

సహకార సంఘాల నిబంధనల ప్రకారం గత ప్రభుత్వం నిబంధనలను పాటించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎందుకంటే గత ప్రభుత్వం సహ కార స్ఫూర్తిని దెబ్బతీస్తూ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా, ఎటువంటి రిజర్వేషన్ పద్ధతులు అమలు చేయకుండా, సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించారనే విమర్శలు విన్పిస్తున్నాయి. సాధారణంగా ఒక్కొక్క సహకార సంఘంలో 13 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషను ప్రాతిపదికన సభ్యులను ఎంపిక చేస్తారు. కాని ఆ రిజర్వేషన్ నిబంధనలను పాటించకుండా త్రిసభ్య కమిటీలను నియమించారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను రద్దు చేసి అధికారికంగా అధికారులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### ఎన్నికలా ? కమిటీలా ?

వైసీపీ త్రిసభ్య కమిటీలను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. పర్సన్ ఇన్‌చార్జిలను నియ మించింది. దాంతో అధికారికంగా త్రిసభ్య కమిటీలు రద్దయ్యా యి. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుందా లేదంటే కొన్ని రోజుల వరకు మళ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తుందా అనే అంశంపై చర్చ నడుస్తోంది. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై సహకార సిబ్బంది ఆసక్తిగా గమనిస్తు న్నారు. కూటమి శ్రేణులు తమకూ నామినేటెడ్ ద్వారా అవ కాశం ఇవ్వాలని ఆశిస్తున్నారు.కొద్ది రోజుల పాటైనా కమిటీల తోనే ముందుకు వెళ్లాలని అభి ప్రాయంతో కూటమి శ్రేణులు న్నాయి.

## కొనసాగుతున్న ముసురు

ఏలూరు సిటీ, జూన్ 28 : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కారణంగా ఏలూరు జిల్లాలో శుక్రవారం వర్షం పడింది. ఈ వర్షాలు కారణంగా బయట వాతావరణం చల్ల బడినా ఇళ్లల్లో ఇంకా వేడిమి ఏ మాత్రం తగ్గలేదు. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 14 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 7 మి.మీ నమోదైంది. పెదవేగిలో 13.2, కొయ్యలగూడెం 12.4, బుట్టాయిగూడెం 11.2, జంగారెడ్డిగూడెం 8.4, కలిదిండి 7.8, ఉంగుటూరు, కామవరపుకోట, జీలుగుమిల్లిలలో 7.2, చింతలపూడి 7, లింగపాలెం, చాట్రాయిలలో 6.8, ద్వారకా తిరుమల 6.6, ముదినేపల్లి, భీమడోలులో 6.4, టి.నరసాపురం, ముసునూరు, వేలేరుపాడులలో 6.2, మండవల్లి 5.6, ఆగిరిపల్లి 5.4, నిడమర్రు, దెందులూరు, ఏలూరు అర్బన్‌లలో 5.2, నూజివీడు, ఏలూరు రూరల్‌లలో 4.6, పెదపాడు 4.2, కుక్కునూరు 4, కైకలూరులో 3.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షాల రాకతో సార్వా పనులు చురుగ్గా సాగుతున్నాయి.

# కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌కు ఆరు నెలల జైలు

- కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు తీర్పు

ఏలూరు టూ టౌన్, జూన్ 28 : ఏలూరు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్యకు కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు ఆరు నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధించింది. ఆయన మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ సస్పెండ్ అయ్యారు. కొవిడ్ సమయంలో తప్పిదాలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారుల నివేదిక ఆధారంగా వెంకటేశ్‌ను డైరెక్టరేట్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) అధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై ఆయ న హైకోర్టుకు వెళ్లగా.. సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లో చేర్చు కోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీనిపై వెంకటేశ్‌ను విధుల్లో చేర్చుకోవాలని డీఎంఏ అప్పటి మునిసిపల్ కమిషనర్ చంద్రయ్యకు ఉత్తర్వులు ఇచ్చారు. కాని వైసీపీ ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు వెంకటేశ్‌ను విధుల్లోకి చేర్చుకోకపోవడంతో ఆయన మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై కోర్టు ధిక్కరణ కింద చంద్రయ్యకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పునిచ్చారు.

# సమన్వయమేదీ..?

- అధికారుల తీరుపై ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆగ్రహం
- చింతలపూడి కొత్త బస్టాండ్ ఆకస్మిక తనిఖీ
- డ్రెయినేజీ సమస్యపై అధికారులతో సమీక్ష



కొత్త బస్టాండు వద్ద డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, జూన్ 28 : 'చింతలపూడి కొత్త బస్టాండ్‌లో డ్రెయినేజీ సమస్యతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. గత ఐదేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాలేదు.. మురుగునీటిని బయటకు పంపడం తమ పరిధిలోనిది కాదని చెప్పడం ఎంతవరకు సమంజసం.. అధికారుల మధ్య సమన్వయం లేదు..' అంటూ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం స్థానిక కొత్త బస్టాండ్‌ను ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ ప్రయాణికులతో మాట్లాడి ఆవరణను పరిశీలించారు. అక్కడ నుంచే మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేయగా ఆ సమస్య తమ పరిధిలోకి రాదంటూ సమాధానం ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'టైమ్‌కు బస్సులు రావడం లేదని అనేకమంది ప్రయాణికులు ఫోన్‌ల ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. బస్టాండు ఆవరణ అంతా మురుగుమయంగా, అధ్వా నంగా ఉంది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. అధికారులు బాధ్యతగా పని చేయాలి. నిర్లక్ష్యం వహిస్తే సహించబోము' అని ఆయన హెచ్చరించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం రాత్రి పట్టణంలో డ్రెయినేజీ సమస్యపై మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి నాయకుల సమక్షంలో సమీక్షించారు. సాయిబాబా గుడి వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకు మూడు కిలోమీటర్ల మేర మెయిన్ రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీలో సిల్ట్‌ను తొలగించేందుకు శనివారం నుంచే కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపై గోతులు పూడ్చాలని ఆదేశించారు. కమిషనర్ ప్రసాదరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ సుందరం తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తా : కలెక్టర్



ఏలూరు కలెక్టరేట్, జూన్ 28 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తానని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, ఇరిగేషన్, గృహనిర్మాణం తదితర శాఖల అధికారులు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వివరాలు, నిర్వాసితులకు అమలు చేస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం, స్పిల్‌వే, స్పిల్ ఛానెల్, ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు, డయా ఫ్రమ్‌వాల్ దెబ్బతిన్న ప్రాంతాలను, తదితర వివరాలను ఇరిగేషన్ ఎస్‌ఈ వివరించారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాల వివరాలు, నిర్వాసితులకు నిబంధనల మేరకు చెల్లించాల్సిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో నష్టపరిహారంగా నగదు చెల్లింపు, పునరావాస కాలనీల నిర్మాణం, భూమికి భూమి, ప్యాకేజి చెల్లింపుల్లో ఫిర్యాదుల పరిష్కారం తదితర వివరాలను ఐటీడీఏ పీవో వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో పోలవరం ప్రాజెక్టును సందర్శించి క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుంటానన్నారు. డీఆర్వో పుష్పమణి, ఆర్డీవోలు ఎన్.ఎస్.కె ఖాజావలీ, కె.అద్దయ్య, గృహనిర్మాణ సంస్థ పీడీ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 94910 41188

### సమస్యలు వాట్సప్ ద్వారా తెలపవచ్చు..

ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను వాట్సప్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చు. ప్రజలు తమ సమస్యలు, తమ దృష్టికి వచ్చిన సామాజిక సమస్యలు, పింఛన్, రేషన్ పంపిణీ తదితర సేవలకు సంబంధించి ఫిర్యాదు చేయాలనుకుంటే జిల్లా కలెక్టర్ ఫోన్ నెంబర్ 94910 41188కు వాట్సప్ ద్వారా తెలపవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు.



నోటీసులు జారీచేసిన అక్రమ కట్టడం

# ఇంటి కోసం అనుమతి పొంది..

- నిబంధనలు అతిక్రమించిన వైసీపీ కౌన్సిలర్
- నూజివీడులో అక్రమ కట్టడానికి నోటీసులు

నూజివీడు, జూన్ 28 : నిబంధనలు పాటించి ఆదర్శంగా ఉండాల్సిన పురపాలకులే తన సొంత భవనాల నిర్మాణంలో నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణాలు సాగిస్తుండడం విశేషం. నూజివీడు పురపాలక సంఘంలో వైసీపీకి చెందిన ఒక కౌన్సిలర్ పట్టణంలోని కొన్నంగుంట రోడ్డులో జీ+1 గృహ నిర్మాణం పేరుతో భవన నిర్మాణానికి పురపాలక సంఘం నుంచి 2011లో అనుమతి తీసుకు న్నారు. కాని నివాస గృహం కాకుండా అనుమతికి మించి రెండు ఫ్లోర్‌లు వేసి వాటిలో మినీ ఫంక్షన్‌హాల్, రెస్టరూమ్స్ పేరుతో లాడ్జిని నిర్వహిస్తున్నారు. ఇటీవల మరో రెండు ఫ్లోర్‌లు ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో పుర పాలక సంఘ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌ను వదలాల్సిన భవన నిర్మాణ దారుడు నిబంధనలు అతి క్రమించారని, గృహ అవసరాలకు అనుమతులు పొంది, వ్యాపార అవ సరాలకు వినియోగిస్తున్నారని, 509 స్క్వేర్ మీటర్లకు అను మతులు పొంది, 1536 మీటర్ల వరకు నిర్మించడం నిబంధ నలకు విరుద్ధమని, ఏడురోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్టు మునిసిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి ఆంధ్రజ్యోతికి వివరించారు.

# నిర్లక్ష్యం వద్దు!



- రోడ్డు ప్రమాదాల్లో 95 శాతం మంది హెల్మెట్ ధరించనివారే మృత్యువాత
- యజమాని మరణంతో కుటుంబం ఛిన్నాభిన్నం
- హెల్మెట్ లేకుంటే రూ.వందే జరిమానా.. అంతేకదా అన్నభావనలో వాహనదారులు
- జుత్తుపై మోజుతో మరికొందరు హెల్మెట్‌కు దూరం
- హెల్మెట్ ధరించాల్సిందేనంటూ ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ

ఏలూరు క్రైం, జూన్ 28 : తన కుటుంబానికి ఎలాంటి కష్టం రాకుండా వారి అవసరాలన్నీ సమకూర్చి తీర్చే కుటుంబ యజమాని తన కొద్దిపాటి నిర్లక్ష్యంతో అనుకోని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే అతన్నే నమ్ముకున్న ఆ కుటుంబాన్ని చీకటి కమ్మేస్తుంది. భారత దేశంలో రోడ్డు ప్రమాదాలపై అనేక మంది అధ్యయనాలు చేసి చివరకు ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలపై దృష్టి పెట్టారు. ఏ వ్యక్తి అయినా ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడగానే మొదట తల భాగానికి దెబ్బ తగులుతుందని స్పష్టం చేశారు. మనిషి తల 8 కేజీల నుంచి 13 కేజీల బరువు ఉంటుందని ప్రమాదం జరిగి రోడ్డుపై పడినప్పుడు తొలుత తల నేలకు తగులు తుందని ఆ తర్వాతే కాళ్ళు, చేతులు తగులుతాయని వైద్య నిపుణులు గుర్తించారు. సీసీ కెమెరా ఫుటేజ్‌లోను ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించారు. ఈ పరిస్థితిలో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోకుండా ఉండాలంటే ఖచ్చితంగా హెల్మెట్ ధారణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వాలు చట్టాలను చేశాయి. ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్‌ను ధరించి ద్విచక్ర వాహనాన్ని నడపాలని నిబంధనలు విధించారు. వాహనాన్ని అమ్మే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్‌ను ఇవ్వాలని మోటారు షోరూమ్ నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రస్తుతం ఏ బైక్ కొన్న ఖచ్చితంగా హెల్మెట్‌ను వాహనదారుడికి అందిస్తున్నారు.

> ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తాం. నాణ్యత కల్గిన హెల్మెట్లనే వాహనదారులు ధరించాలి. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలపై మరణించిన వారిలో 95 శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్లే మృతి చెందారు. నూతన మోటారు వాహన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఎవరైనా నిబంధనలు అతిక్రమి జరిమానాలు విధిస్తాం.
>
> హెల్మెట్ ధారణపై అవగాహన
> ఎస్పీ మేరీ ప్రశాంతి

### కేవలం రూ.100 జరిమానా..

ఇప్పటి వరకు హెల్మెట్ లేకపోవడం వల్ల కేవలం రూ.100 జరిమానా విధిస్తున్నారు. ఆ జరిమానాను సచివాలయంలో, ఆన్‌లైన్‌లో, మీ సేవలోనూ చెల్లించాలంటే అదనంగా రూ.35 ఫీజును కట్టాల్సి ఉంటుంది. ఇంత తక్కువ జరిమానాయే కదా అని చాలామంది హెల్మెట్ ధరించడం లేదు. కొంతమంది హెల్మెట్లు ధరించడం వల్ల జుత్తు ఊడిపోతుందనే భావనతో పెట్టడం మానేస్తు న్నారు. వాస్తవానికి హెల్మెట్ ధారణ వల్ల జుత్తు ఊడిపోవడం జరగదని దుమ్ము, ధూళి, సూర్యరశ్మి నుంచి కాపాడుతుందని వైద్యులు చెబుతున్నారు.

### నిబంధనల అతిక్రమణ

ఖచ్చితంగా మోటారు వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ఆ వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని నిబంధనలు ఉన్నా కొంతమంది వీటిని అతిక్రమిస్తున్నారు. గతేడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే హెల్మెట్ ధరించని వారు మృతి చెందారని గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఈ దిశగా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.


ఏలూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

ఏలూరు క్రైం, జూన్ 28 : జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకుని, అత్యవసర చికిత్స, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ల సంఖ్య, వివిధ వైద్య విభాగాలు, వార్డులు, గర్భిణుల వార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. చంటి పిల్లల విభాగం, కంటి పరీక్షల విభాగం పరిశీలించి ఆక్సిజన్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. తరచూ ప్రభుత్వాసుపత్రులను తనిఖీ చేస్తానని, వైద్యసేవల్లో లోపాలు కనిపించినా, రోగులు ఫిర్యాదు చేసినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం మెడికల్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన సరుకులు అందించండి : ఎమ్మెల్యే బాలరాజు


జీసీసీ గిడ్డంగులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

బుట్టాయగూడెం, జూన్ 28: గిరిజన సహకార సంస్థ ద్వారా నాణ్యమైన సరుకులను అందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కేఆర్.పురంలోని జీసీసీ గోడౌన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి అక్రమాలు, తప్పిదాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్ రాజయోగి, సీఎస్ఆర్ఐ పద్మ, గోడౌన్ సూపరింటెండెంట్ అర్జునుడు, గోడౌన్ డీఈవో ఎస్.సూర్యచంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## బిడ్డ అనారోగ్య సమస్య ఎమ్మెల్యేకు వివరించిన తల్లి


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 28: అనారోగ్యానికి గురైన కుమారుడికి ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయిస్తే పరిస్థితి మరింత విషమించిదని ఓ తల్లి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లింది. కొవ్వలికి చెందిన గొరిపర్తి కృష్ణకుమారి కుమారుడు గోపి (22)కి ఆహారం తీసుకోవడంలో సమస్య వచ్చింది. ఏలూరు ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేశారు. రూ.4లక్షలు అప్పుచేసి విజయవాడ ఆస్పత్రిలో వైద్యం చేయించినా పరిస్థితి మెరుగపడలేదు. దీనితో కృష్ణకుమారి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలసి తనగోడును వెళ్లబోసుకుంది. జిల్లా వైద్యాధికారులతోపాటు ఆస్పత్రి వైద్యులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. గోపికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కృష్ణకుమారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని ఎమ్మెల్యే ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

## పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

లింగపాలెం, జూన్ 28: ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేయాలని ఎంపీడీవో రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో రాంబాబు శుక్రవారం సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు పంపిణీలో అవసరం మేరకు అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తల సహాయం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై గ్రామ కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ జేఎం.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 28: ధాన్యం బకాయి వెంటనే చెల్లించాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం సొమ్ములు ఇవ్వకపోతే సార్వాసాగు చేయలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఎన్నికల ముందు రెండు, మూడు రోజులకే చెల్లించి ఎన్నికల తరువాత పౌర సరఫరాలశాఖ చేతులు ఎత్తివేయడంతో రైతులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, చిన్నిపోతురాజు, అన్నంరెడ్డి రంగారావు, నాగరాజు, రాము, ధర్మవరపు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## భూముల ఆన్‌లైన్ పేరుతో అక్రమ వసూళ్లు

జీలుగుమిల్లి, జూన్ 29 : తహసీల్దారు కార్యాలయంలో భూముల ఆన్‌లైన్ విషయమై అధికారులు దృష్టిసారించాలని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1/70 చట్టంకు విరుద్ధంగా రెవెన్యు అధికారులు ఆధారాలు లేకపోయినా గిరిజనేతరులకు భూములు ఆన్‌లైన్ చేస్తున్నారని ఆరోపించారు. 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూములు ఆన్‌లైన్ చేయకుండా నెలలు తరబడి తిప్పుతున్నారన్నారు. 12 ఎకరాలకు రూ.8 లక్షలు చొప్పున తీసుకుని గిరిజనేతరుల నుంచి కొన్న భూములకు కలెక్టరు అనుమతి లేకుండా ఆన్‌లైన్ చేశారన్నారు. ములగలంపల్లికి చెందిన దళారీ ఉద్యోగులకు మామూళ్లు ఇస్తూ భూముల ఆన్‌లైన్ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. భూముల ఆన్‌లైన్ వ్యవహారంపై ఆర్డీవో, జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరపాలని చిట్టిబొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ డిమాండ్ చేశారు.

## నగర ప్రజల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టూటౌన్, జూన్ 28: నగర ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే చంటికి సీపీఎం బృందం విజ్ఞప్తి చేసింది. బడేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నాయకులు కలసి నగర సమస్యలపై చర్చించారు. అనంతరం నగర కార్యదర్శి కిశోర్ మాట్లాడుతూ పేదల మురికివాడల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. విలీన గ్రామాల ప్రజలకు గోదావరి కాల్వ నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేయలన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు.డిగ్రీ కాలేజీకి నూతన భవనాలు నిర్మించాలన్నారు. ఏరియా ఆసుపత్రిని రిఫరల్ ఆసుపత్రిగా చేయాలన్నారు. శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించాలన్నారు. జూట్‌మిల్లు తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ఇప్పటికే అధ్యయనం చేశానని ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. సాయిబాబు, రవికిషోర్, రామాంజనేయులు, జగన్నాధరావు, అరుణకుమారి, రాజ్యలక్ష్మి, ప్రసాద్, శారద, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పెదవేగి సీఐ

ఏలూరు క్రైం, జూన్ 28: జిల్లాలో పోలీసులు రాత్రివేళల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ తనిఖీలు నిర్వహించారు. వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు. రాత్రివేళ బస్టాండ్, రైల్వేస్టేషన్లో, లాడ్జిల్లో కొత్త వ్యక్తుల వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, జూన్ 28: న్యాయసేవా సదన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని రత్న ప్రసాద్ తెలిపారు.

# నాడు నేడు

## మొండిగోడలతో మిగిలిన పాఠశాల భవనాల నిర్మాణం


బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం పాఠశాల భవనం


జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల భవనం

బుట్టాయగూడెం, జూన్ 28: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పేరిట చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాలు నిధులు లేక నిలిచిపోయాయి. పాత భవనాలు లేక కొత్త భవనాలు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలంలో 28 పాఠశాలలకు మరమ్మతులు పూర్తిచేసిన ప్రభుత్వం రెండో దశలో 31 పాఠశాలల నిర్మాణాలు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టింది. వీటిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, 28 పాఠశాల భవనాలు ఉన్నాయి. నూతన పాఠశాలల నిర్మాణాలకు రూ.10.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ.3.31 కోట్లను మాత్రమే విడుదల చేసింది. నిధులు లేక పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

భవన నిర్మాణాలు నిలిచిపోవడంపై ఎంఈవో టి.బాబురావును వివరణ కోరగా నిధులు అందక పనులు నిలిచిపోయాయని తెలిపారు. రూ. 7.19 కోట్లు రావలసి ఉందన్నారు. వాటిలో ప్రభుత్వం సరఫరా చేసిన మెటీరియల్‌కు 40 శాతం పోగా 60 శాతం ఆర్ఎఫ్ ఫండ్స్ రావాలని తెలిపారు.

### జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: మండలంలో రెండో దశ నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. రివాల్వింగ్ ఫండ్ లేక కొన్ని పనులు ఆగిపోతే ప్రభుత్వం అందించే ఇసుక, సిమెంట్ అందక మరికొన్ని పనులు నిలిచిపోయాయి. మండలంలో 73 ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి 7405 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రవేశాలు జరుగుతుండడంతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

మండలంలో ఇంకా రూ.9 కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనులు పూర్తికాకపోవడంతో తలుపులు, కిటికీలు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లు, నల్లబల్లలు, బెంచీలు, మంచినీటి సరఫరా సామగ్రి పాఠశాలకు చేరలేదు. నూతన కూటమి ప్రభుత్వం త్వరలో నిలిచి పోయిన పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.




కేఆర్.పురంలో సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న డీఎంవో సురేష్‌కుమార్, చింతలపూడిలో ర్యాలీ, చిన నిండ్రకొలనులో పారిశుధ్యం పరిశీలిస్తున్న డీపీవో

# మలేరియా నియంత్రణపై దృష్టి సారించాలి

బుట్టాయగూడెం, జూన్ 28: పశ్చిమ ఏజెన్సీలో తరుచు మలేరియా జ్వరాలు వచ్చే గ్రామాలను గుర్తించి నివారణ చర్యలపై దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి జె.సురేష్‌కుమార్ సూచించారు. కేఆర్.పురం మలేరియా కార్యాలయంలో ఐదు మండలాల పీహెచ్‌సీల సూపర్‌వైజర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది నిరంతరం గ్రామాల పర్యవేక్షణ చేయాలని, ప్రతిరోజు నివేదిక కార్యాలయానికి అందించాలన్నారు. ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేశామని సిబ్బంది గ్రామాల పర్యటనలను అందులో నమోదు చేయాలన్నారు. ప్రజలను కలవడం, మలేరియాపై అవగాహన కల్పించడం, ముందుస్తు చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్లు వి.పెద్దిరాజు, నాగేశ్వరావు, ఎంపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

- చింతలపూడి: ప్రజల సహకారం ఉంటే మలేరియా నివారించగలమని చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ఎస్.ప్రసాద్ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవ ముగింపు సందర్భంగా శుక్రవారం సుబ్రీయన్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్ సయ్యద్‌జపురుల్లా, కె.శ్రీనివాసరావు, మంగతాయారు, కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పారిశుధ్యం మెరుగుపరచాలి : డీపీవో

నిడమర్రు: చిననిండ్రకొలను గ్రామంలో పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ సందర్శించి మాంసం వ్యాపారులతో మాట్లాడుతూ కుళ్లిన, నిల్వ ఉంచిన మాంసం విక్రయించవద్దని సూచించారు. గ్రామంలో కాలువ పనులను పరిశీలించి పూడికతీత చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. డయేరియా వ్యాప్తిని పూర్తిస్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకుంటామని డీపీవో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో స్టాప్ డయేరియా కాంపెయిన్ నిర్వహించారు. చిన నిండ్రకొలనులో తాగు నీరు,పారిశుధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

- పెదవేగి: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణిమ తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందితో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షపునీరు నిల్వ ఉండి, దోమలు పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, పరిశుభ్రత పాటించేలా చూడాలని చెప్పారు. సమావేశంలో సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## బాగా చదవాలి, ఉన్నతంగా ఎదగాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న బలరామ్

ఏలూరు రూరల్, జూన్ 28: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నతంగా ఎదగాలని టీడీపీ నాయకులు ఎంఆర్‌డి బలరామ్ అన్నారు. గంగానమ్మ మున్సిపల్ పాఠశాలలో ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. బలరామ్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చోడే వెంకటరత్నం, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరు కార్పొరేషన్: సత్యసాయి సేవా సంస్థ సేవలు అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి భవనం వద్ద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కానుమిల్లి శశిశేఖరరావు, పయిడేటి రామారావు పాల్గొన్నారు.
- జనార్థనస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ విఠాల శేషగిరి పడమరవీధిలోని లోక్‌నాథ మునిసిపల్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పులి శ్రీరాములు, హెచ్ఎం డి.ఇంద్రాణి, నగర ప్రముఖులు జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కైకరంలో 'బడికి పోదాం' ర్యాలీ

ఉంగుటూరు, జూన్ 28: కైకరం హైస్కూలు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బడికి పోదాం పద ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులు బడికి రాని పిల్లల ఇళ్లకు వెళ్ళి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రంగారావు సేవలు ఆదర్శనీయం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 28 : అభ్యుదయవాది దివంగత బొమ్మి రంగారావు సేవలు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద రంగారావు 29వ వర్ధంతి నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధులు, సీపీఐ నాయకులు చింతల సూర్యనారాయణ, మన్నవ కృష్ణ చైతన్య, ఉప్పులూరి హేమసుందర్, ఎస్.సంజీవరావు, జె.మధు, కడుపు కన్నయ్య, రామకృష్ణ, నాగేశ్వరరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహ మునిసిపల్ ప్రైమరీ స్కూలులోని పిల్లలకు, అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు తదితర కిట్‌లను అందజేశారు.

## జంగారెడ్డిగూడెంలో హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీ

జంగారెడ్డిగూడెం, జూన్ 28: పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారి కావ్యారెడ్డి పలు రెస్టారెంట్‌లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. బిర్యానీ సెంటర్, రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల నమూనా సేకరించారు. .వాటిని ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. ఫుడ్ లైసెన్స్ లేని వారికి నోటీసులు ఇచ్చారు. లైసెన్స్‌లు లేని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టీడీపీ కార్యకర్త పిల్లలకు ఎమ్మెల్యే రోషన్ సాయం

జంగారెడ్డిగూడెం, జూన్ 28: నాగులగూడెం టీడీపీ కార్యకర్త లాగు బాలయ్య కొంతకాలం క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. బాలయ్య కు ఇద్దరు కుమార్తెలున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన స్పందించి ఆడపిల్లల చదువుల నిమిత్తం రూ.20 వేలను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే సాయం అందించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## డ్రెయిన్లలో మురుగు తొలగించిన అధికారులు

### ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


డ్రెయిన్‌లో చెత్త తొలగిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం, జూన్ 28: కొయ్యలగూడెం కాళింగపేటలో మురుగు డ్రెయిన్‌కు మోక్షం కలిగింది. చెత్త పేరుకుపోవడంతో మురుగు రోడ్డుపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు వర్షం కురవడంతో మరింత మురుగునీరు రోడ్డు పైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జేసీబీతో డ్రైన్లలోని మురుగు తొలగించారు. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేరుగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీకి చర్యలు

చింతలపూడి, జూన్ 28: మండలంలో పింఛన్‌దారులకు జూలై 1న ఇంటి వద్ద పింఛన్ అందించడానికి చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో రాటాలు తెలిపారు. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 9597 మంది పింఛన్ దారులకు రూ.6.58 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఒకేరోజు నూరుశాతం పంపిణీ చేసే విధంగా ఉద్యోగులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. నగర పంచాయతీలోని ఐదు సచివాలయాల పరిధిలో కూడా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజ్ తెలిపారు. ఐదు సచివాలయాల పరిధిలో 2,845 మంది లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తామని, కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలి

టి.నరసాపురం, జూన్ 28: ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు టీవీఎస్ రాజు శుక్రవారం కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు అందరికి అన్ని రకాల విత్తనాలను 90శాతం సబ్సిడీతో పంపిణీ చేయడంతో పాటు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలని కోరారు. రూ. 5లక్షల వరకు పావలా వడ్డీతో రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డీవైఈవో ప్రకాష్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంతవరకు అందలేదని సంఘ జిల్లా అధ్యక్షుడు నాని అన్నారు. సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న పాఠశాలల్లో ఐటి సబ్జెక్టును బోధించేందుకు ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద కుటుంబాల పిల్లలతో భర్తీచేయాలన్నారు. ఫీజు చెల్లించాలని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పిల్లల తల్లితండ్రులను వేదిస్తున్నాయని ఆరోపించారు. విష్ణు, రాజేష్, క్రాంతి, మణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 : ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థిస్తూ ఏపీ పీఎల్‌టీయూ నాయకులు శుక్రవారం విజయవాడలో హోంశాఖ మంత్రి అనితకు వినతిపత్రాన్ని అందజేశారు. తమ అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారని సంఘ అధ్యక్షుడు అంబేడ్కర్, శ్యాంప్రసాద్, రవిబాబు తదితరులు తెలిపారు.

# సమస్యలపై గళం విప్పిన ప్రజాప్రతినిధులు

## బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశం


సమావేశంలో సమస్యలు వివరిస్తున్న వైస్ ఎంపీపీ మోహనరావు

బుట్టాయగూడెం, జూన్ 28: మండల పరిషత్ సమావేశంలో సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పారు. గత ప్రభుత్వం హయాంలో పెద్దగా మాట్లాడని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల ఎదుట ఏకరవు పెట్టారు. ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం శుక్రవారం జరిగింది. వైస్ ఎంపీపీ గుగ్గులోతు మోహనరావు మాట్లాడుతూ మండలానికి వచ్చిన నిధులు, ఏ పనులకు ఖర్చు చేశారో అధికారులు చెప్పడం లేదన్నారు. ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ నిధుల వివరాలను సమావేశంలో వివరించారు. వేసవిలో జీడిమామిడి తోటలు కాలిపోతే ఉద్యాన శాఖ అధికారులు స్పందించలేదని, నష్టపరిహారం ఇవ్వలేదని రాజానగరం సర్పంచ్ కుంజా దుర్గమ్మ సమావేశం దృష్టికి తెచ్చారు. చీమలవారిగూడెంలో పైపులైన్ పాడైపోయి మంచినీటి సమస్య ఏర్పడితే సొంతంగా రూ.17 వేలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించానని, ఇంతవరకు ఆ సొమ్ము ఇవ్వలేదని కేఆర్.పురం సర్పంచ్ ఉయికె బుజ్జి వాపోయారు. మేకలకు వేలాది రూపాయలు ప్రీమియం కట్టినా బీమా ఇవ్వలేదని మంగయ్యపాలెం సర్పంచ్ మాల్చి వెంకన్నబాబు అధికారులను నిలదీశారు. పోగొండ జలాశయం నుంచి అచ్చియ్యపాలెం సమీపంలో ఉన్న చెరువుకు నీరందించాలని సర్పంచ్ కుంజం వెంకటేశ్వరావు ఇరిగేషన్ అధికారులను కోరారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత అధికారులు వివరణ ఇచ్చినా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతృప్తి చెందలేదు. వ్యవసాయం, ఉద్యాన, విద్య, వైద్యం, ఐసీడీఎస్, ఆర్ అండ్ బి, పీఆర్, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ తదితర శాఖల పనితీరుపై సమీక్ష చేశారు. తహసీల్దార్ సీహెచ్.వెంకటేశ్వర్లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### సమావేశాన్ని పట్టించుకోని సిబ్బంది

సమావేశంలో సమస్యలు హోరెత్తుతున్నా సిబ్బంది పట్టనట్లు వ్యవహరించారు. ఇద్దరు సిబ్బంది ఒకే ఇయర్ ఫోన్స్ చెరోచెవిలో పెట్టుకుని సెల్‌ఫోన్‌లో మునిగిపోయారు. మరికొందరూ సెల్‌ఫోన్లలో మాట్లాడడం, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు. ప్రజాప్రతినిధులు ఏమి అడగుతున్నారు, అధికారుల సమాధానాలు కూడా పట్టించుకోని ఒక శాఖకు చెందిన సిబ్బంది సెల్‌ఫోన్‌లో మునిగిపోయారు. వారు చేస్తున్న పనికి పక్కనే కూర్చున్న తోటి సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

## కేంద్ర మంత్రి గడ్కరిని కలసిన ఎంపీ మహేష్



ఏలూరు టూటౌన్, జూన్ 28: ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ కలిశారు. ఏలూరు జిల్లాలో రోడ్లు అధ్వాన స్థితికి చేరాయని మంత్రికి ఎంపీ వివరించారు. రోడ్ల నిర్మాణానికి, పాతరోడ్ల మరమ్మతులకు తగిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చాని ఎంపీ మహేష్ తెలిపారు.

## పురపాలక మంత్రికి నగర సమస్యలు : ఎమ్మెల్యే చంటి


మంత్రి నారాయణను సత్కరించిన ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, జూన్ 28: ఏలూరు నగర పాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ మంత్రి పి.నారాయణను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో మంత్రి నారాయణను శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటి సన్మానించారు. ఏలూరు పేరుకే కార్పొరేషన్ అని పాలన అంతా మున్సిపాలిటీ స్థాయికే పరిమితమైందని తెలిపారు. కార్పొరేషన్‌లో పలు కీలకపోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రధాన నగరాల అభివృద్ధితో పోటీ పడేందుకు సహకరించాలన్నారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందిస్తూ నగరాభివృద్ధికి తోడ్పడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే బడేటి చంటి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు


పల్లా శ్రీనివాస్‌తో రామారావు

కొయ్యలగూడెం, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన పల్లా శ్రీనివాస్‌కు పారేపల్లి రామారావు అభినందనలు తెలిపారు. శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఆయన వెంట స్థానిక నాయకులు కూడా కూడా ఉన్నారు. బీసీలకు టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

## కలెక్టర్‌ను కలసిన ద్వారకా తిరుమల ఈవో


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఈవో

ఏలూరు కలెక్టరేట్, జూన్ 28: కలెక్టర్ కె.వెట్రిసెల్విని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవో వేండ్రత్రినాథరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రావాలని ఆహ్వానించారు.

## ఎమ్మెల్యే మద్దిపాటిని కలసిన ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, జూన్ 28: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లజర్లలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఈవో త్రినాథరావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

## నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బదిలీ

ఏలూరు టూటౌన్, జూన్ 28: నగరపాలక సంస్థలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్.రాధా బదిలి అయ్యారు. డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీఎంఏ ఆఫీసు నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పీజీసెట్ ర్యాంకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 : ఏయూ పీజీసెట్-2024లో కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ గిరిబాబు శుక్రవారం తెలిపారు. ఎంకాం విభాగంలో శ్యామ్‌అచ్యుత్ 49వర్యాంకు, జువాలజీలో నవీన్‌కుమార్, దుర్గాప్రసాద్, దుర్గాబాను గాయత్రి, స్మితా బ్లెస్సీ, స్వాతి, శిరీష అత్యుత్తమ ర్యాంకులు సాదించారని వివరించారు. ర్యాంకర్లను అబినందించినవారిలో అధ్యాపకులు విజయ్‌కుమార్, వెంకట్రావు, రాంబాబు, సుశ్మలత, కరుణలత తదితరులున్నారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీని బలోపేతం చేయాలని, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ కేంద్రమంత్రి సురేష్‌కుమార్ పరాస్ పేర్కొన్నారని, ఆర్.ఎల్.జె.పి రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ తెలిపారు. ఢిల్లీలో గురువారం వివిధ రాష్ట్రాల అధ్యక్షులతో సమావేశం జరిగిందన్నారు. పార్టీని బలోపేతం చేసేదిశగా ముందడుగు వేయాలని పార్టీ కార్యకర్తలకు సురేష్‌కుమార్ పరాస్ సూచించారన్నారు. గ్రామ,వార్డు, జిల్లా కమిటీలు పూర్తిచేయాలని ఆదేశించారని పేర్కొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఎన్డీఏ కూటమి విజయానికి విశేష కృషి చేసిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును యోగా సభ్యులు సత్కరించి జ్ఞాపికను అందచేశారు. యోగాకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.
- అంబికాదేవి ఆలయంలో శుక్రవారం భక్తులు సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. సౌభాగ్యలక్ష్మీదేవి, అగ్రహారం రాజ్యలక్ష్మి , బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ అమ్మవారి సన్నిధిలోను మహిళలు శుక్రవారం కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారిని ఆరాధించారు.
- **జంగారెడ్డిగూడెం :** ఆంజనేయస్వామి వారి జన్మనక్షత్రం (పూర్వాబాద్ర) సందర్భంగా మద్ది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో స్వామి వారిని, అమ్మవారి విగ్రహాలను పూలతో అలంకరించి ఆలయ అర్చకులు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ,కూరగంటి రంగారావు, ఈవో ఆకుల కొండలరావు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** చేబ్రోలు సాయి గాయత్రి అమ్మవారికి ఉంగుటూరు భద్రకాళి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు
- **పెదవేగి :** దివ్యాంగులకు అవసమైన ఉపకరణాలను అందించడానికి శనివారం దెందులూరు ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం జరుగుతుందని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలన్నారు.
- **కుక్కునూరు :** జనసేన పార్టీ బలోపేతానికి ముఖ్య కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి జనసేన నాయకులు, కార్యకర్తలు చేయాల్సిన విధి విధానాలు, పార్టీలో చేరికలపై చర్చించారు. ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

# పొగాకు అ'ధర'హో..

» కిలో పొగాకు ధర రూ.368

» సిరులు కురిపిస్తున్న సాగు » వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధిక ధర » ఆనందంలో రైతు కుటుంబాలు

గోపాలపురం, జూన్ 28: ఏజెన్సీ మెట్ట ప్రాంత రైతాంగానికి పొగాకు సాగు సిరులు కురిపిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో తేలిక నేలల్లో పండే వర్జీనియ పొగాకు పంట లేకపోతే రైతులతో పాటు రైతుకూలీలకు ఒకప్పుడు పని ఉండేది కాదు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు గత 50 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలుకుతోంది. ఈ ప్రాంతంలో పండే పంట దేశంలోనే నాణ్యమైనది కావడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో పండే పొగాకు పంటకు ధరలో వ్యత్యాసం పలుకుతోంది. గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొగాకు రైతాంగం అప్పులు తీరగా రెండో ఏడాది పంట వేయకతప్పడం లేదనే భావనలో ఉన్నారు. రెండేళ్ల నుంచి పొగాకు సాగు ప్రారంభం నుంచి ఎన్నడూ లేని ధరలు కిలో పొగాకు ధర రూ.368 పలికింది. దీంతో తమ కష్టానికి తగిన ఫలితం చూస్తున్నామనే భావనతో పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు, రైతుకూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపురం వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

### ధరకు తగ్గ దిగుబడి లేదు



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పెట్టుబడికి తగిన దిగుబడి రాలే దు. పొగాకు సాగు చేసే రైతులకు పెట్టుబడుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

- ముళ్ళపూడి శివాజీ
పొగాకు రైతు, చెరుకుమిల్లి.

### ధరల పెంపుతో ఊరట



పొగాకు సాగు ప్రారంభం నుంచి ఇప్పటివరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సన్న, చిన్నకారు రైతులు పొగాకు ధరతో ఊపిరి పీల్చుకున్నారు. నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుందామనే స్థితి నుంచి కుటుంబ సమేతంగా గుప్పెడు మెతుకులు తింటున్నామన్న భావం వచ్చింది. ధరలు రైతులకు ఊరటనిచ్చినట్లయింది.

- కొడవటి చినవెంకటేశ్వరరావు
పొగాకు రైతు, గోపాలపురం

# ఉద్యాన వర్సిటీలో ఏం జరుగుతోంది ?

**వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో దేశంలోనే రెండోది. ఇదే విషయాన్ని వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునేది. విశ్వవిద్యాలయ అధికారులు సైతం గర్వించేవారు. ప్రతి సదస్సు, సమావేశాల్లోనూ ప్రస్తావించేశారు. గడచిన ఐదేళ్లుగా ఉద్యాన విశ్వవిద్యాలయం మసకబారిపోయింది. పదవులు పట్టుకుని వేలాడే అధికారులు తప్ప.. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకున్న చర్యలు లేవు. ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంభించింది.**

» హైకోర్టులో వీసీ నియామకం రద్దు.. అయినా విధుల్లోనే వైస్ చాన్సలర్
» ప్రభుత్వ నిర్ణయం ఏమిటో.. ?

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్న ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. ప్రతినిత్యం ఏదో ఒక విషయమై రచ్చ సాగుతోంది. తాజాగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పదవి వివాదస్పదమైంది. వైస్ చాన్సలర్ డాక్టర్ జానకీరామ్‌ను రెండోసారి నియమించడ్నాన తప్పు పడుతూ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. మొదటిసారి నియామకమే అడ్డదారిలో జరిగిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. వైస్ చాన్సలర్ నియామకాన్ని రద్దు చేసింది. దాంతో ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఇది తీవ్ర చర్చకు దారితీసింది. వైస్ చాన్సలర్ డాక్టర్ జానకీరామ్ రాజీనామా చేస్తారని అంతా అనుకున్నారు. ఆయన మాత్రం యథావిధిగానే విధులకు హాజరవుతూ పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న ధ్యాసతో ఉన్నారు. వాస్తవానికి వైసీపీ హయాంలో విశ్వ విద్యాలయ అధికారులంతా వైసీపీ ప్రభుత్వానికి వంతపాడారు. ఏకపక్షంగా వ్యవహరించారు. అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రభుత్వ పరంగా నిధులు రాబట్టలేకపోయారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిని విస్మరించారు. పోస్టింగ్ నియామకంలోనూ పక్షపాతంగా వ్యవహరించారన్న అపవాదును ఎదుర్కొన్నారు. వైస్‌చాన్సలర్ పదవీ కాలం పూర్తికావడంతో ఎన్నికలకు ఆరు నెలల ముందు మరోసారి దక్కించుకున్నారు. రెండో పర్యాయం ఆయననే నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.



ఉద్యాన వర్సిటీ

### సెర్చ్ కమిటీ ఏమైనట్టు ?

విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్ నియమించాలంటే సెర్చ్ కమిటీ ఏర్పాటు చేస్తారు. ఆ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని సెర్చ్ కమిటీ పరిశీలిస్తుంది. ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ప్రభుత్వానికి ముగ్గురు పేర్లను ప్రతిపాదిస్తుంది. ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ అందులో ఒకరిని వైస్ చాన్సలర్‌గా నియమిస్తారు. ఒక్కోసారి ప్రభుత్వ సిఫారసులను పక్కనపెట్టి.. అదే ముగ్గురిలో మరో వ్యక్తిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. భారత వ్యవసాయ పరిశోధన మండలినుంచి ఎవరినైనా నియమించాలంటూ ముందుగా ఆ సంస్థ అనుమతి ఉండాలి. ఇవేమీ పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్సలర్‌ను నియమించారు. రెండోసారి అదే వ్యక్తికి వీసీ పదవిని కట్టబెట్టింది. దీనిని హైకోర్టు తప్పుపట్టింది. వీసీ నియామకాన్ని రద్దు చేసింది. ఇప్పుడు బంతి రాష్ట్ర ప్రభుత్వ కోర్టులో ఉంది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అప్పటిదాకా వేచి చూడాలన్న తలంపుతో వీసీ ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఎప్పటిలాగే విధులకు హాజరవుతున్నారు.

## క్రైం కార్నర్

### విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పెనుగొండ, జూన్ 28 : విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందిన ఘటన వడలి గ్రామంలో జరిగింది. ఎస్ఐ షేక్ సుభాణి తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కౌలురైతు తానేటి గంగయ్య(58) గురువారం సాయంత్రం పొలం వెళ్లి దారికి అడ్డంగా పడి ఉన్న విద్యుత్ వైరును పట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. రాత్రి అంతా ఇంటికి తిరిగి రాకపోవడంతో గాలించగా శుక్రవారం ఉదయం పొలంలో మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. విద్యుత్ శాఖ వైఫల్యం వల్ల కౌలు రైతు చనిపోయాడని, ఆ కుటుంబానికి రూ.15 లక్షల నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం వడలి శాఖ నాయకులు డిమాండ్ చేశారు.

### ప్రేమికుడు జైల్లో ఉన్నాడని బాలిక ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూన్ 28 : ప్రేమించిన యువకుడు జైలులో ఉన్నాడని తన ప్రేమను పెద్దలు వ్యతిరేకించారని మనస్తాపంతో ఒక బాలిక (16) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏలూరులో ఓ ప్రాంతానికి చెందిన బాలిక పదో తరగతి చదివింది. తన మొబైల్‌లోని ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వరికూటి మధుకుమార్(20)తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈనెల 18వ తేదీన ఆ బాలికను ఏలూరు బస్టాండ్‌కు రమ్మని అక్కడ నుంచి తన గ్రామానికి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయగా అనంతరం పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మధుకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ బాలిక గురువారం రాత్రి తన ఇంట్లో అందరూ నిద్రపోయిన తరువాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి ఆ బాలిక మరణించింది. ఆ ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.

### మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, జూన్ 28 : మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఒంటెద్దు నరసింహారావు(25) అనే యువకుడికి జనవరి నెలలో తండ్రి నరసింహారావు మృతి చెందడంతో తన పెదనాన్న ఇంటి వద్ద ఉంటున్నాడు. అప్పటి నుంచి ఆ యువకుడి మానసిక స్థితి సరిగాలేదని తెలిపారు. ఈక్రమంలో శుక్రవారం స్థానిక పిరమిడ్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. పురుగుల మందు తాగినట్లు క్రాంతికుమార్ అనే వ్యక్తికి తెలియజేయగా అతడు ఘటనా స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

### బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

కైకలూరు, జూన్ 28: కత్తిపూడి-పామర్రు జాతీయ రహదారిలో లారీ మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శుక్రవారం రాత్రి కైకలూరు మండలం గుమ్మళ్ళపాడుకు చెందిన యాళ్ళ భీమరాజు(45) తన పనులపై పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఆకివీడు నుంచి తన స్వగ్రామం వెళుతుండగా సోమేశ్వరంలో ఉప్పుటేరు సెంటర్లో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తెలుసుకున్న కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

### గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

» ఆరు కేజీల 200 గ్రాముల గంజాయి స్వాధీనం

ఏలూరు క్రైం, జూన్ 28 :గంజాయిని కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను ఎస్ఐ మదీనీబాషా అరెస్టు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడిలో కొంతమంది యువకులు గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ బాషా తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. భీమడోలులోని గణపతినగర్‌కు చెంది పప్పుల సురేష్, ఏలూరు గ్జేవియర్ నగర్‌కు చెందిన నడిపూడి కల్యాణ్, ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన పర్వాక అశోక్, మరో 17 ఏళ్ల యువకుడిని అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

### మహిళను మోసగించి రూ.49 వేలు అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 28 : ఒక మహిళ తన కొత్త ఏటీఎం కార్డును పిన్ జనరేట్ చేయడానికి ఏటీఎం సెంటర్‌కు వెళ్ళగా అక్కడ ఓ వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డును మార్చేశాడు. ఆ కార్డు ద్వారా రూ.49 వేలు డ్రా చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు సమీపంలోని కొత్తూరునకు చెందిన కాట్రగడ్డ శుభాషిణి తన ఏటీఎం కార్డు పిన్ జనరేట్ చేయడానికి ఏలూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ పిన్ జనరేట్ చేసే సమయంలో ఒక వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకుని పిన్ జనరేట్ చేసి కార్డు మార్చేశాడు. ఆ తరువాత 49 వేల రూపాయలు డ్రా అయినట్టు మెసేజ్ రావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోదావరికి కొత్తనీరు

» స్వల్పంగా పెరిగిన వరద నీరు

కుక్కునూరు/వేలేరుపాడు, జూన్ 28: గోదావరికి కొత్తనీరు చేరింది. నిన్నటి వరకు గోదావరిలో నీరు లేక వెలవెలబోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులోకి కొత్తనీరు చేరింది. శుక్రవారం ఎగువ భాగాన గల గోదావరికి దిగువ భాగానికి వరదనీరు చేరుకోవడంతో ఇసుక మేటలు మునగడంతో పాటు వాగుల నుంచి ప్రవహించడంతో వరదనీటితో జలకళ కనిపిస్తోంది. తెలంగాణ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల మరింత వరదనీరు చేరుకోవడంతో భద్రాచలం వద్ద స్వల్పంగా నీటిమట్టం నమోదవుతుంది. రానున్న మరో 2,3 రోజులకు మరింత వరదనీరు చేరుకునే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జూలై రాకముందే గోదావరికి వరదనీరు చేరుకోవడంతో ఈ ఏడాది కూడా గోదావరికి వరదలు పోటెత్తే అవకాశాలు ఉండడంతో వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కుక్కునూరు మండల తహసీల్దార్ అచ్యుతకుమారి మాట్లాడుతూ గోదావరిలో చేపలు పట్టడానికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిలో నీరు లేకపోవడంతో గోదావరి అవతల ఉన్న గ్రామా లకు పలు రాకపోకలు సాగిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



రుద్రమ్మకోట వద్ద పెరిగిన గోదావరి

### ఏపీ టూరిజం బోట్ల నిలిపివేత

పోలవరం జూన్ 28 : ఏపీ టూరిజం బోట్లను తాత్కాలి కంగా నిలిపివేసినట్టు ఏపీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాభావం వల్ల ఈదురుగాలులు వీస్తున్న నేపథ్యంలో ఏపీ టూరిజం పేరంటాలపల్లి విహారయాత్ర బోట్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని వాతావరణ పరిస్థితులు మెరుగైన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పునఃప్రారంభిస్తామని తెలిపారు.



పోశమ్మ గుడి వద్ద నిలిచిన టూరిజం బోట్లు

# నదులు, చెరువు గట్లను పటిష్ట పరచాలి

» ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, జూన్ 28 : జిల్లాలో బలహీనంగా ఉన్న నదులు, చెరువుల గట్లను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పటిష్టపరచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశం మందిరంలో శుక్రవారం ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను ఆమె అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో తుఫాన్‌లు, వరదలు సంభవించే అవకాశం ఉన్నందున బలహీనంగా ఉన్న గట్లను వెంటనే పటిష్టం చేయాలన్నారు. వరదల సమయంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేసే అంశంపై ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. గోదావరి నదికి భద్రాచలం, ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక వెలువడిన వెంటనే ప్రజలను ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, తదితర విధులకు సంబంధించి సిబ్బందికి విధులు కేటాయించి సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద , భోజన, వసతి సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య కేంద్రాలు, తదితర ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గిరిజన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని మారుమూల పల్లె ప్రాంతాలకు వరదల సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నందున నిత్యావసర సరుకులను ముందుగానే పంపించాలన్నారు. కాల్వలు, వాగులు పొంగే అవకాశం ఉన్నందున కాజ్‌వే వంటి వాటి వద్ద వరద నీరు ఉధృతి ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఉంచాలని ప్రజలు ఎవరినీ అనుమతించకుండా అక్కడ సిబ్బందిని నియమించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, డీఆర్‌వో డి.పుష్పమణి, ఆర్డీవోలు ఎన్ఎస్‌కే ఖాజావలి, హౌసింగ్ పీడీ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వ్యవసాయం రంగంలో ఇంజనీర్లు, ఆధునిక సాంకేతికత కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 28 :వ్యవసాయరంగంలో ఇంజనీర్లు, ఆధునిక సాంకేతికత పాత్ర ఎంతో కీలకమైందని రాయచూర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఎంటమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభురాజ్ అన్నారు. ఏపీ నిట్‌లో శుక్రవారం ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగం సౌజన్యంతో 'వ్యవసాయరంగంలో ఇంజనీర్, ఆధునిక సాంకేతికత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విత్తిన నుంచి చేతికి వచ్చేంత వరకూ పలువురు రైతులు యాంత్రీకరణ ఉపయోగించి రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. నేల సారం, తేమ, వాతావరణం వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కృత్రిమ మేదస్సు, డ్రోన్ టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ తదితర ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకున్నప్పుడే పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు దిగుబడి పెంచుకోవచ్చన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు తమ బృందం ఈ-శాప్ యాప్ రూపకల్పన చేసిందని దీనిద్వారా పంట ఆరోగ్య పరిస్థితులు, తెగుళ్ళ, వాటి నివారణ పద్ధతులను సులువుగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కార్తికేయశర్మ, డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

### అత్తిలిలో విగ్రహాలు ధ్వంసం.. కేసు నమోదు

అత్తిలి, జూన్ 28 : అత్తిలి కాల్వ గట్టున ఉన్న విజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో గల ఉపాలయంలోని గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవారి విగ్రహాల చేతులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆలయ ధర్మకర్త కందుల సత్యనారాయణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి ఆలయానికి అనుబంధంగా గత ఏప్రిల్‌లో శివలింగం, వల్లీ దేవసే సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు తెలిపారు. గురువారం సాయంత్రం ఓ భక్తుడు ఉపాలయంలో గల అమ్మవారు, వినాయకుడి విగ్రహాల చేతులను విరిగినట్టు గుర్తించి అర్చకుడు కృష్ణవంశీకి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. ఆలయానికి సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ.. ఆ సమయంలో పనిచేయకుండా చేసినట్టు గుర్తించి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆలయం వద్ద భద్రతా చర్యలు తీసుకుంటున్నామని అత్తిలి ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు.




వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

### పారిజాత గిరి శ్రీవారి ఆదాయం రూ.8.69 లక్షలు

జంగారెడ్డిగూడెం, జూన్ 28 : జంగారెడ్డిగూడెం పట్టణం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయం రూ.8,69,182 వచ్చిందని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆలయంలో మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షణలో 90 రోజులకు గాను హుండీల లెక్కింపు నిర్వహించారు. మద్ది ఆంజనేయస్వామి దేవస్థాన కార్యాలయ పరిపాల నాధికారి కె.రంగారావు, కామయ్యపాలెం సేవాసంఘం సభ్యులు, ఏలూరు రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ సభ్యులు, ఇండియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తుడి కారు నుంచి మంటలు

» బయటకు పరుగులు తీయడంతో తప్పిన పెనుముప్పు



ద్వారకాతిరుమల, జూన్ 28: శ్రీవారి క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడి కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులోని వారు అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. దీంతో పెనుముప్పు తప్పింది. ఈ ఘటన కొండ దిగువనున్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. భీమవరానికి చెందిన శివారపు చల్లారావు కుటుంబసమేతంగా శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమలకు వచ్చారు. స్థానిక బ్యాంక్ వద్దకు చేరుకునే సరికి ఒక్కసారిగా కారు నుంచి పొగ, మంటలు వ్యాపించాయి. కారును ఆపి కేకలు పెడుతూ బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను రక్షించుకున్నారు. కారులో ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం.. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు వాటర్‌పైప్ ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంజన్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఈవిధంగా మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.

## విద్యా సమాచారం

### 11 నుంచి డీఎస్సీకి ఉచిత శిక్షణ తరగతులు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 28: బీసీ స్టడీ సర్కిల్ ఏలూరులో డీఎస్సీ పరీక్షకు బీసీ, ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అభ్యర్థులకు జూలై 11 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల ఆసక్తి ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జూలై 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవా లన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, కుల, ఆదాయ ధ్రువీక రణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు రూ.1500 స్టైఫండ్, బుక్స్ అలవెన్సు కింద రూ.వెయ్యి ఇస్తామన్నారు. మరింత సమా చారానికి బీసీ స్టడీ సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లీష్ మీడియం యూపీ స్కూల్, వెన్నవల్లివారిపేటలో సంప్రదించాల న్నారు. సమాచారానికి 99123 94799 నంబరులో సంప్రదించాలన్నారు.

### ఐటీఐలో ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 : జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో పలు కోర్సుల్లో అడ్మిషన్లకు రెండోవిడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత శుక్రవారం విడుదల చేశారు. ఐటీఐలలో మిగిలివున్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను జూలై 24 సాయంత్రం ఐదు గంటల్లోపు విద్యార్థులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుచేసిన అనంతరం అప్లికేషన్ కాపీ ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి ఎంచుకున్న సంబంధిత ఐటీఐలలో జూలై 25 సాయంత్రం 5 గంటల్లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు జూలై 27, 28వ తేదీలలో, ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్లకు 29, 30వ తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 627 సీట్లు, ప్రైవేటు ఐటీఐలలో 1650 సీట్లు రెండో విడత అడ్మిషన్లకు అందుబాటులో ఉన్నాయన్నారు.

### శిక్షణతో కూడిన ఉపాధి కోర్సులకు దరఖాస్తులు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఏలూరు సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ హోం అప్లయిన్సెస్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణనిచ్చిన అనంతరం ఉపాధి కల్పించేందుకు జూలై 5లోగా అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని ప్రిన్సిపాల్ రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఖాళీగావున్న 45 ఏళ్ల వయస్సులోపు అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు సెల్ 89785 24022 నంబరులో సంప్రదించాలన్నారు.

### ఇన్‌సర్వీస్ కోర్సుగా బీపీఈడీకి అనుమతించాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 :మున్సిపల్ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులను బీపీఈడీ కోర్సును ఇన్‌సర్వీస్ కోర్సుగా పూర్తిచేసేందుకు అనుమతించాలని శుక్రవారం ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ డైరెక్టర్ల సదస్సులో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి మున్సిపల్ పాఠశాలల్లో పీఈటీలను నియమించాలని, జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి, ప్రాథమిక తరగతుల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సంఘ నాయకులు మాధవీలత, జోజిబాబు, ప్రసన్న, సురేష్, మురళీకృష్ణ, లీలాకుమారి పాల్గొన్నారు.



# వ్యవసాయ కూలీలకు అస్వస్థత

» పొగాకు తోటలో పురుగుల మందులే కారణం..
» జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో వైద్యం.. నిలకడగా పరిస్థితి

బుట్టాయగూడెం, జూన్ 28 : పొట్ట చేతపట్టుకుని కూలీ పనుల కోసం ఏజెన్సీకి వచ్చిన కొందరు వ్యవసాయ కూలీలు గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి కూలీలు, కుటుంబ సభ్యులు వారిని తొలుత బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి శుక్రవారం తరలించారు. ప్రస్తుతం కూలీల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మునిసిపాలిటీ మాచవరం మండలం కొత్తపాలెంకు చెందిన పలు కుటుంబాలకు చెందిన వ్యవసాయ కూలీలు వర్జీనీయా పొగాకు పనుల కోసం బుట్టాయగూడెం మండలం దొరమామిడికి మద్దిపాటి రాము, మద్దిపాటి మాణిక్యాలరావు వద్దకు వచ్చారు. గురువారం పొగాకు తోటలో వర్షంలోనే ఆకు కొట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకునే సమయంలో 15 మంది వరకు వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. డయేరియా ఏమోనని భయపడగా పొగాకు తోటలకు వాడిన పురుగు మందుల గాటు వల్ల అస్వస్థతకు గురయ్యారని ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలు

# కుల ధ్రువీకరణ పత్రాల జారీపై పునరాలోచించాలి

ఏలూరు రూరల్/భీమవరంటౌన్, జూన్ 28: సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీఆర్వో లాగిన్‌లో సరైన డేటా పంపకుం డా కేవలం పేర్లు ఉండడంతో పాటు చనిపోయిన వారు, ఇతర గ్రామాల వారు ఈ డేటాలోకి వచ్చారన్నారు. సుమోటో కుల ధ్రువీకరణ వల్ల ఎవరికి ఉపయోగమో ఒకసారి ఆలోచించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు, ఇతర పథకాలకు అవసరం ఉంటే చేయొచ్చు. కాని ఎవరూ అడగకుండా 60, 70 ఏళ్లు ఉన్నవారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం సరికాదన్నారు. సరైన సమాచారం లేకుండా ఏవిధంగా చేయాలని, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికా రులు దీనిపై ఒత్తిడి చేయడం సరికాదని ఆయన ఆయన అన్నారు. ఒకటో తేదీన ఇచ్చే పించన్ల విషయంలో సచివాలయ సిబ్బంది ఇవ్వాల్సిన పెన్షన్ల బాధ్యత కూడా వీఆర్వోలకు చెబుతున్నారని.. ఆ పనిచేయటానికి తాము సిద్ధంగా ఉన్నామని, కాని ఓవైపు రెవెన్యూకు సంబంధించి లక్ష్యాలు విధించడం, మరోవైపు ఇతర పనులు చేయాలనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అవసరం లేని వారికి కులధ్రువీకరణ పత్రాలు అందించాలని కిందిస్థాయి అధికారులను ఒత్తిడి చేయవద్దని అధికారులు సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.



హాస్టల్‌లో ఆహారం తీసుకుంటున్న విద్యార్థులు

**సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించటం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల (వార్డెన్ల)కు భారంగా మారింది. ఐదు నెలలుగా ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు చెల్లించకపోవటంతో అప్పు చేసి విద్యార్థులకు భోజనం, టిఫిన్ ఖర్చులు భరించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా తిరిగి అప్పు చేసి విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.**

# 5 నెలలుగా అందని డైట్

**అప్పు తెచ్చి విద్యార్థులకు భోజనాలు**

**ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ల వెతలు**

**కొత్త ప్రభుత్వమైనా పట్టించుకోవాలని వినతి**

(ముదినేపల్లి)

హాస్టళ్లు ప్రారంభమై 15 రోజులైనా పెండింగ్ డైట్ బిల్లులు రాకపోవటంతో వార్డెన్లు ఆర్థిక భారంతో కుంగిపోతున్నారు. తమకు వచ్చే జీతాలతో కుటుంబ పోషణ చూసుకుంటూనే మిగిలిన సొమ్మును వసతి గృహాల నిర్వహణకు ఖర్చు పెడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి కైకలూరు నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు సుమారు రూ.30 లక్షలు డైట్ చార్జీలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అధికారులు నెలవారీ బిల్లులు పంపుతున్నా ప్రభుత్వ స్థాయిలో పట్టించుకున్న వారు లేరు. ఒక్కో వసతి గృహ వార్డెన్ ఇప్పటికే రూ.1.50 నుంచి 2 లక్షల వరకు వ్యాపారుల వద్ద అరువుపై సరుకులు, పాలు తీసుకున్నారు. కొంతమంది వార్డెన్లు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యార్థులకు ఏప్రిల్ వరకు భోజనాలు పెట్టారు. పది రోజుల క్రితం వసతి గృహాలను తెరవటంతో తిరిగి విద్యార్థులకు భోజన సదుపాయంతో పాటు స్నాక్స్, పాలు ఇచ్చేందుకు సొమ్ము అవసరం కాగా, మళ్లీ అప్పు తెచ్చి వ్యాపారులకు పాత బకాయిలు కొంత చెల్లించి తిరిగి సరుకులు అరువుపై తెస్తున్నారు. కొంతమంది వార్డెన్లు బంగారం తాకట్టు పెట్టి మరీ విద్యార్థులకు భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం అయినా పెండింగ్ డైట్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

## బకాయిలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లా

ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులు డైట్ చార్జీల బకాయిలు పేరుకుపోయాయి. ఐదు నెలల నుంచి డైట్ ఛార్జీల నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవటంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుల పాలయ్యారు. గతంలో ఈ విషయాన్ని మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లా. అయినా పట్టించుకోలేదు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లాం.

**-మనోహర్ రెడ్డి, ఏపీ వార్డెన్ల సంఘం అధ్యక్షుడు**

తొలగించాలని ఆదేశాలున్నా..

# జాప్యమేల?



వివాదాస్పద కట్టడం

ముసునూరు, జూన్ 28: మండలంలోని రమణక్కపేట పంచాయతీ పరిధిలో ఉన్న కోమటికుంట చెరువులో వైసీపీ నేత అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్ తొలగింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కొద్ది నెలల క్రితం ఆర్ఎస్ నంబర్ 256-1లో ఉన్న చెరువు భూమిలో 0.20సెంట్లు పూడ్చి మరీ అక్రమ నిర్మాణం చేయడంపై స్థానిక టీడీపీ నేత రంగు శ్రీనివాసరావు జిల్లా ఉన్నతాధికారులకు, మండల, గ్రామస్థాయి అధికారులకు మార్చి నెలలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు రికార్డులు పరిశీలించి అక్రమ కట్టడం పంచాయతీ చెరువు భూమిగా నిర్ధారించి, నిర్మాణం ఆపివేయాలని ఆక్రమణదారుడికి నోటీసులు జారీ చేసినా నిర్మాణాన్ని తొలగించలేదు. దీంతో కోమటికుంట చెరువుకు చెందిన ప్రభుత్వ భూమిలో ఆక్రమణను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రెవెన్యూ, పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల సహకారంలో వారం రోజుల్లో తొలగించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీచేశారు. ఈ ప్రక్రియ జరిగి మూడు నెలలు కావస్తున్నా నేటికీ ఆక్రమణలో ఉన్న అక్రమ కట్టడాన్ని తొలగించలేదు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోగా ఆ స్థలాల కోసం పోరాడి, అవి ప్రభుత్వ స్థలాలే అని నిర్ధారించి, ఆక్రమణలను తొలగించమంటే కూడా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని టీడీపీ నాయకుడు రంగు శ్రీనివాసరావు ప్రశ్నించారు. అక్రమకట్టడాన్ని వెంటనే తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకునేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఏలూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.



యర్రావారిగూడెం పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమం

## మూతపడిన పాఠశాలను ప్రారంభించాం

**విద్యార్థులను బడికి పంపండి: ఎంఈవో**

చాట్రాయి, జూన్ 28: మండలంలోని కొత్తగూడెం శివారు యర్రావారిగూడెంలో గత ఏడాది విద్యార్థులు లేక మూతబడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో శుక్రవారం ఎంఈవో వీఎస్వీ బ్రహ్మచారి పునఃప్రారంభించారు. పాఠశాలను పునఃప్రారంభించాలని గ్రామస్థులు ఇటీవల ఎంఈవోకు అర్జీ ఇవ్వగా, డీఈవో అనుమతి తీసుకొని స్కూల్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సొంత ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, మంచి భవనాలు, ఇతర సదుపాయాలతో నాణ్యమైన విద్యను పిల్లలకు అందించే అవకాశం ఉండగా, తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి 20, 30 కిలో మీటర్ల దూరంలో ప్రైవేటు స్కూల్స్ పంపటం ఎంత వరకు సమంజసమో తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. సర్కార్ విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో మళ్లీ ఈ పాఠశాల మూతబడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని గ్రామస్థులను కోరా ఉప సర్పంచ్ మంచిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాజారత్నం, గ్రామ ప్రముఖులు మరివాడ శ్రీనివాసరావు, రాజమోహనరావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



రావమ్మ ఆలయంలో మంత్రి సారథికి సత్కారం

## మొక్కు తీర్చుకున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, జూన్ 28: గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో గల దుగ్గిరాల రావమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా దేవదాయశాఖ కార్యదర్శి సురేష్‌బాబు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి దయ వల్లే తాను ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు మంత్రి పదవి దక్కిందన్నారు. తన విజయానికి సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తల రుణం తీర్చుకుంటానన్నారు. ఆలయానికి కల్యాణ మండపం కట్టిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, సుబ్బారావు, శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈదరలో విద్యుదాఘాతంతో మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించారు. అధికారులతో మాట్లాడి డిపార్ట్‌మెంట్‌ల పరంగా వచ్చే బీమా సొమ్మును తక్షణమే వచ్చేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఈదులగూడెం గ్రామంలో ఈడే నాగేంద్రరావు, పండిపోయిన నాగేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి భరోసా ఇచ్చారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

చాట్రాయి, జూన్ 28: జిల్లాల వారీగా ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని, కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబు ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మండలంలోని చనుబండలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం చంద్రబాబు, మంత్రి పార్థసారథి, కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయటం వల్ల ఎంతో మంది మాదిగ యువత జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. తరువాత రద్దు కావటం తమ జాతికి శాపం అయ్యిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధతకు ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో జరిగిన సుదీర్ఘ పోరాటం ఫలించి త్వరలోనే మాదిగ జాతికి న్యాయం జరగబోతున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుగు ముత్తయ్య, ఏసుపాదం, వెంకటేశ్వరరావు, మారేష్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కువ కేసులు రాజీ చేయండి

కైకలూరు, జూన్ 28: నేడు మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ జరిగేలా చూడాలని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి కైకలూరు కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని రాజీ చేసుకోదగిన కేసులన్నీ కక్షిదారులు రాజీ చేసుకోవాలన్నారు. సివిల్, చెక్ బౌన్సు తదితర కేసులపై పోలీసులు దృష్టి పెట్టి ఎక్కువ కేసులు పరిష్కరించాలన్నారు.

## ఆలయ భూమి లీజు వేలం వాయిదా

ముదినేపల్లి, జూన్ 28 : ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయానికి చెందిన 5.86 ఎకరాల వ్యవసాయ భూమిని లీజుకు ఇచ్చేందుకు శుక్రవారం నిర్వహించాల్సిన బహిరంగ కౌలు వేలం వాయిదా పడింది. తిరిగి జూలై 6న ఈ వేలం నిర్వహిస్తామని దేవస్థానం ఈవో ఎస్.కె.కిషోర్ తెలిపారు.



తాగునీటి పరీక్షలు చేస్తున్న ఆరోగ్యశాఖాధికారులు

## విద్యార్థులకు రక్షిత నీరందించాలి

కలిదిండి, జూన్ 28 : వర్షాల దృష్ట్యా పాఠశాలల్లో విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. శుక్రవారం పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న తాగునీటిని పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత తాగునీటితో అతిసారం ప్రబలుతుందన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో వాటర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వంట శాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో కలుషిత నీరు తాగి విద్యార్థులు డయేరియా బారిన పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జనసేన నాయకుడి సహకారంతో అన్న క్యాంటీన్



కైకలూరు, జూన్ 28: అన్న క్యాంటీన్ ద్వారా ప్రతి పేదవాడికి ఉచితంగా భోజనాన్ని అందజేస్తున్నామని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కైకలూరులో జనసేన నాయకుడు ముత్యాల తరుణ్‌సాయి ఆర్థిక సాయంతో 400 మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రతి రోజూ దాతల సహకారంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, అద్దంకి రమేష్‌రాజు, బొర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో బస్సులు చాట్రాయి వరకు నడపాలి



చాట్రాయి, జూన్ 28: విజయవాడ నుంచి విస్సన్నపేట వరకు నడుపుతున్న మెట్రో బస్సులను మండల కేంద్రం చాట్రాయి వరకు పొడిగించాలని కోరుతూ ఎంపీడీవో మంగాకుమారికి కూటమి నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ చాట్రాయి నుంచి విజయవాడకు నేరుగా బస్సులు లేకపోవటం వల్ల వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు ఆసుపత్రులు ఇతర పనుల కోసం విజయవాడ వెళుతుంటారని, పాసింజర్ బస్సులు, ఆటోల్లో విస్సన్నపేట వెళ్లి మెట్రో బస్సులు ఎక్కటం, తిరిగి వచ్చేటప్పుడు విస్సన్నపేట నుంచి ఇళ్లకు చేరుకోవటానికి వ్యయప్రయాసలకు గురవుతున్నారని అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో మూడు బస్సులు చాట్రాయి వరకు నడపాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు తుమ్మల జగన్, కె. ముత్తారెడ్డి, ఏఎస్ఎం శర్మ, దుర్గాప్రసాద్, శ్రీమన్నారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, జూన్ 28: నూజివీడు డివిజన్‌లో శుక్రవారం 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 6.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో అత్యధికంగా చింతలపూడిలో ఏడు మిల్లీమీటర్లు, చాట్రాయి, లింగపాలెం మండలాల్లో 6.8, ముసునూరులో 6.2, ఆగిరిపల్లిలో 5.4, నూజివీడులో 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## పుస్తకాలు, పెన్నుల వితరణ



మండవల్లి, జూన్ 28: మండలంలోని మూలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సజ్జ సురేష్‌బాబు(బాబి) చేతుల మీదుగా పుస్తకాలు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఎన్డీయే నాయకుడు చలసాని కోటేశ్వరరావు ఆర్థిక సాయంతో వీటిని పంపిణీ చేశారు. హెచ్ఎం ఎం. మార్గరెట్, ఎన్డీయే నాయకులు చలసాని కోటేశ్వరరావు (కోటయ్య), గన్నమనేని నాని, గజ్జల గణేష్, గుడివాడ గణేష్, ఉపాధ్యాయులు ఎస్. భారతీదేవి, బి. సామ్రాజ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## పల్లాకు ముద్దరబోయిన అభినందన



నూజివీడు టౌన్, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వానికి, కార్యకర్తలకు అను సంధానంగా ఉండి అందరి ఆదరాభిమానాలు పొందా లని, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పల్లాను ముద్దర బోయిన అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టబోయే ప్రజా సంక్షేమ పథకాలను టీడీపీ కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్ళి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రీనివాసరావు కృషి చేస్తారన్నారు.

## విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండండి

కలిదిండి, జూన్ 28 : వర్షాల దృష్ట్యా విద్యుత్ స్తంభాల స్తంభాలు, వైర్లు పడిపోతే వెంటనే సిబ్బందికి తెలియజేయాలని డీఈఈ టి.రామకృష్ణ ప్రజలకు సూచించారు. తడి చేతులతో స్విచ్ బోర్డు, ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. అవగాహన, అనుభవం లేని వ్యక్తులతో విద్యుత్ పరికరాల మరమ్మతులు, వైరింగ్ చేయించరాదన్నారు. ఆక్వా రైతులు తమ చెరువుల వద్ద నాణ్యమైన మోటార్లు, ఏరియేటర్లు వినియోగించాలన్నారు. సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## వైద్య శిబిరం ఏర్పాటు

ఆగిరిపల్లి, జూన్ 28: మండలంలోని చొప్పరమెట్ల పంచాయతీలోని తాడేపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో జ్వరాల అదుపునకు సగ్గూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నూతి నీటిని పరీక్షించి బ్యాక్టీరియా కారణంగా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని గుర్తించారు. ఈ బాక్టీరియా వల్ల జ్వరం, ఒంటిపై దద్దుర్లు వస్తాయని మరో వారం రోజుల్లో జ్వరాలు పూర్తిగా అదుపులోకి వస్తాయని సగ్గూరు పీహెచ్‌సీ డాక్టర్ మంజులా దేవి, నూజివీడు సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద తెలిపారు. శుక్రవారం గ్రామాల్లో హోమియో వైద్య శిబిరం జ్వరాలు, కీళ్ళవాతంతో బాధపడుతున్న రోగులకు సగ్గూరు పీహెచ్‌సీ సిబ్బంది సహకారంతో ఇంటింటికి హోమియో మందులు 3500 డోసులు పంపిణీ జరిగిందని, సీజనల్ వ్యాధులు రాకుండా మందులు ఆగిరిపల్లి డిస్పెన్సరీలో దొరుకుతాయని హోమియో డాక్టర్ రజిత తెలిపారు.

## క్రైం సమాచారం

### లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు దుర్మరణం

కైకలూరు, జూన్ 28: కత్తిపూడి-పామర్రు జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. కైకలూరు మండలం గుమ్మళ్ళపాడు గ్రామానికి చెందిన యాళ్ళ భీమరాజు (45) పనిమీద పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు తన ద్విచక్రవాహనంపై వెళ్లి రాత్రి సుమారు 8 గంటల సమయంలో తన స్వగ్రామం వస్తుండగా సోమేశ్వరంలోని ఉప్పుటేరు సెంటర్లో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో భీమరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కైకలూరు రూరల్ ఎస్సై టి రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### మహిళను మోసగించి సొమ్ము అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 28 : ఒక మహిళ తన కొత్త ఏటీఎం కార్డును పిన్ జనరేట్ చేయడానికి ఏటీఎం సెంటర్‌కు వెళ్ళగా అక్కడ ఓ వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డును మార్చేశాడు. ఆ కార్డు ద్వారా రూ.49 వేలు డ్రా చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు సమీపంలోని కొత్తూరునకు చెందిన క్రాటగడ్డ శుభాషిణి తన ఏటీఎం కార్డు పిన్ జనరేట్ చేయడానికి ఏలూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ పిన్ జనరేట్ చేసే సమయంలో ఒక వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకుని పిన్ జనరేట్ చేసి కార్డు మార్చేశాడు. ఆ తరువాత 49 వేల రూపాయలు డ్రా అయినట్టు మెస్సేజ్ రావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్‌లకు..

## పర్సన్-ఇన్-చార్జ్‌ల నియామకం



నూజివీడు టౌన్, జూన్ 28: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 409ను విడుదల చేసినట్లు నూజివీడు డివిజన్ కో-ఆపరేటివ్ డీఆర్ ఎం.రవికుమార్ తెలిపారు. నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం 52 పీఏసీఎస్‌లు ఉండగా, పీఏసీఎస్‌ల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో చైర్మన్‌లను నియమించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికే 22 సంఘాలకు సంబంధించిన చైర్మన్‌లు రాజీనామా చేయగా, నాలుగు సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జ్‌లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 26 సంఘాల చైర్మన్‌లు రాజీనామా చేయకుండా బాధ్యతల్లో కొనసాగుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 409 జీవో వారి పాలనకు ముగింపు పలికినట్లు అయింది. ఈ నేపథ్యంలో నూజివీడు కో-ఆపరేటివ్ డీఆర్ ఎం.రవికుమార్ మొత్తం 48 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జ్‌లుగా బ్యాంకు సీనియర్ ఉద్యోగులను నియమిస్తూ ఆదేశాలను జారీ చేశారు.

**ముదినేపల్లి:** కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముదినేపల్లి బ్రాంచి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ జిల్లా సహకార శాఖ అధికారి మిల్టన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదినేపల్లి పీఏసీఎస్‌కు కైకలూరు కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్.ప్రసాదరావు, గురజ సొసైటీకి కైకలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏ.హడీ, దాకరానికి కైకలూరు కో-ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రెహ్మాన్, వడాలి, దేవపూడి, వాడవల్లి పీఏసీఎస్‌లకు ఏలూరు కో-ఆపరేటివ్ సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జె.విజయరాజు, ఉప్పరగూడెం, పెదపాలపర్రు పీఏసీఎస్‌లకు ఏలూరు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీ నాగేశ్వరరావు, బొమ్మినంపాడు, చేవూరు, గోకినంపాడు, కొరగుంటపాలేనికి ఏలూరు కో-ఆపరేటివ్ సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ కుమార్, వైవాక, చిగురుకోటకు ఏలూరు సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాలరెడ్డి, పెనుమల్లి పీఏసీఎస్‌కు ఏలూరు కో-ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి. శుభాకర్‌లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. శనివారం వీరు బాధ్యతలు చేపడతారు.

## గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలలో మంచినీటి ట్యాంకుల పరిశీలిస్తున్న ఎంఈవో

ముసునూరు, జూన్ 28: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, బాలికల ఆర్యోగంపై శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో బీవీ సుబ్బారావు ప్రిన్సిపాల్ కె.ప్రవీణకు సూచించారు. శుక్రవారం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తాగునీటి సరఫరా ట్యాంకులు, బాలికలకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, బాలికలకు నాణ్యత గల రుచికరమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం ఆయన కొత్తగా ఐదో తరగతిలోకి ప్రవేశాలు పొందిన బాలికలతో ముచ్చటించారు. బెంగ లేకుండా చక్కగా చదువుకోవాలన్నారు.

# లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు

**జూలై 1న ఉదయం 6 నుంచి ప్రారంభించాలి**

**అలసత్వం వహిస్తే చర్యలు**

**ఎంపీడీవోల దిశానిర్దేశం**

కైకలూరు, జూన్ 28: ఇళ్ల వద్దే లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్త ప్రభుత్వం నిబంధనల మేరకు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పెన్షన్ పంపిణీ జరగాలని అందుకు గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బందితో పాటు వీఆర్వో సహకారంతో పంపిణీ చేయాలన్నారు. ఎక్కువమంది లబ్ధిదారులున్న గ్రామాల్లో అంగన్వాడీ, ఆశా వర్కర్ల సహాయంతో పంపిణీ జరగాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా ఇకపై ఒక్కో లబ్ధిదారుకు రూ.4వేలు, ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు మూడు నెలలకు మూడు వేలు చొప్పున మొత్తం రూ.7వేలు పెన్షన్ అందజేయనున్నట్లు చెప్పారు. మొదటిరోజే నూరు శాతం పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. కైకలూరు మండలంలో 9582మంది పెన్షన్ దారులకు గాను రూ.6,53,19,500లు నగదు పంపిణీ చేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రతి రోజూ తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని అందుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకర రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకు మారి, తదితరులు పాల్గొన్నారు.

**మండవల్లి:** మండలంలో మొత్తం 6965 పెన్షన్ లబ్ధిదారులకు ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ జరుగుతుందని మండవల్లి ఎంపీడీవో ఆర్ బేబీ శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెలలో పెరిగిన పెన్షన్ మొత్తంతో పాటు ముఖ్యమంత్రి ముందుగానే తెలిపిన విధంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను నెలకు వెయ్యి చొప్పున పెంచిన మొత్తం రూ.3 వేలతో పాటు పెంచిన నెలవారీ పెన్షన్ రూ.4వేలు కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున పెన్షన్ లబ్ధిదారునికి పంపిణీ చేస్తామని తెలిపారు. పెన్షన్‌ను మొత్తం రూ.4,65,89,500 విడుదల కానున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం, ఒకటో తేదీ సోమవారం పెన్షన్ పంపిణీ పూర్తి చేయవలసి ఉన్నందున, గ్రామంలో పెన్షన్‌దారులంతా ఒకటో తేదీన గ్రామంలో అందుబా టులో ఉండి సిబ్బందికి సహకరించాల్సిందిగా శ్రీలక్ష్మి కోరారు.

**ముసునూరు:** ప్రతి లబ్ధిదారుడికి జూలై ఒకటిన ఇంటి వద్దే ఎన్టీఆర్ భరోసా పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆదేశించారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణక్కపేట పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పింఛన్‌దారులకు ఇచ్చిన పుస్తకాలతో సంబంధం లేకుండా పెన్షన్ అందజేసి, వారి వద్ద నుంచి నగదు ముట్టినట్లుగా రసీదుపై సంతకం చేయించుకోవాలని సూచించారు. కేటాయించిన 50 మంది లబ్ధిదారులకు సక్రమంగా పింఛన్ సొమ్ము అందజేయాలన్నారు.

**ఆగిరిపల్లి:** మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. పెన్షన్‌దారులు మొత్తం 9815 మంది అని వీరికి ఇవ్వలసిన మొత్తం రూ. 6 కోట్ల 56 లక్షల 28వేల రూపాయలని తెలిపారు.

పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా జరగాలి

**ముదినేపల్లి:** సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ముదినేపల్లి ఎంపీడీవో మురళీ గంగాధరరావు తెలిపారు. మండలంలో జూలై 1న నిర్వహించనున్న పెన్షన్ల పంపిణీపై శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జూలై 1న ఉదయం ఆరు నుంచి ఇంటింటికీ పంపిణీని ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేయాలన్నారు. సచివాలయాలు, పంచాయతీల సిబ్బందికి తోడు వీఆర్వోలు, వీఆర్ఏలను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. మండలంలో 9073 మంది పెన్షన్‌దారులకు పెరిగిన పెన్షన్ సొమ్మును ఏప్రిల్ నుంచి బకాయిలతో సహా రూ.6.12 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణబాబు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న కైకలూరు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు.. మండవల్లి ఎంపీడీవో శ్రీలక్ష్మి.. ముదినేపల్లి ఎంపీడీవో గంగాధరరావు

## రైతులు పథకాలను వినియోగించుకోవాలి



నూజివీడు టౌన్, జూన్ 28: ఆర్బీకేల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా కోరారు. శుక్రవారం నూజివీడు మండలం తుక్కులూరు ఆర్బీకేని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో సమావేశమై ప్రభుత్వ పథకాలను వివరించారు. నూజివీడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, వ్యవసాయశాఖ అధికారిణి ఏ.చాముండేశ్వరి, ఎస్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నంపేటలో పారిశుధ్య పనులు

చాట్రాయి, జూన్ 28: మండలంలోని చిన్నంపేటలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి నిషాక్ అలీ, ఏఎన్ఎం జగనీ, వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలు తినాలని, దోమ తెరలు వాడాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.